క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



వీపనగండ్ల: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరయిన చెక్కులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వాలే మధన్‌మోహన్‌రావు మండలంలోని తూంకుంటలో బుధవారం బాధితులకు అందజేశారు. చెప్పుల శివుడికి రూ.40 వేలు, మండ్ల చంద్రకళకు రూ.32 వేల ఆర్థికసాయానికి సంబంధించిన చెక్కులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెద్ద రాంబాబు, బలుసరామన్‌గౌడ్, విజయ్, చిన్నరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలి రెట్టింపు చేయాలి

వీపనగండ్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజువారి కూలి రూ.400 చెల్లించాలని సంపత్‌రావుపల్లి మాజీ సర్పంచ్ రామేశ్వర్‌రావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్సకు సంబంధించిన పరికరాలు, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల ఉదయం 10 గంటలకే పని ముగిసే విధంగా చూడాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రేషన్ డీలర్లు లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలి



పాన్‌గల్: మండలంలోని రేషన్ డీలర్లు లైసెన్సులను ఈ నెల చివరి నాటికి తప్పక రెన్యూవల్ చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి డీలర్లకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల సకాలంలో డీడీలు చెల్లించి బియ్యం తీసుకోవాలన్నారు. ఆయా దుకాణాల పరిధిలోని లబ్ధిదారులకు ఇబ్బందులు సృష్టించకుండా బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. దుకాణాల పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న అధికారుల దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో డీటీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఉద్యోగి ఎంపిక



ఆత్మకూర్: స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శిల్ప జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. సికింద్రాబాద్ జింఖాన గ్రౌండ్‌లో జరిగిన ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైనట్లు శిల్ప తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున శిల్ప పాల్గొంటారు. ఈ మేరకు బుధవారం శిల్పను పశువైద్యశాఖ డాక్టర్ మీరాజ్‌అహ్మద్, డాక్టర్ రమేష్, వీఏఎస్ నిర్మల, జేవీఓలు మహిమూద్, సిరాజ్ తదితరులు శాలువాతో సత్కరించి అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆత్మకూర్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేందర్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, వాహనదారులు ఉన్నారు.

కన్నీరే మిగిలింది

- అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాత

ఖిల్లాఘనపురం: మండలంలో కొన్ని రోజులుగా భూగర్భజలాలు వేగంగా అడుగంటడంతో బోరు బావుల్లో నీళ్లు తగ్గాయి. వారం రోజుల కిందటి వరకు పుష్కలంగా నీటి అందించే బోర్లు సైతం ప్రస్తుతం సన్నగా పోస్తున్నాయి. దీంతో సాగు చేసిన వరి పంటలు ఎండి అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని పలుగ్రామాలకు నేటికీ కేఎల్‌ఐ సాగునీరు రాకపోవడంతో బోరు బావుల కిందే సాగు చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో ఎందుతుంటే అన్నదాతలు కంట తడిపెడుతున్నారు. ముందలితండా, కొత్తపల్లితండా, రుక్కన్నపల్లి, తిర్మలాయపల్లి తదితర గ్రామాల్లో ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు ఎంత శ్రమించినా ఫలితం లేకపోవడంతో.. పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతామని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్ట వివరాలు సేకరించి అన్నదాతను ఆదుకోవాలని కోరుతున్నారు.



కర్నెతండా శివారులో ఎండిన పంటను చూపుతున్న రైతు



ముందలితండాలో బోరుబావిలో ఎండుతున్న వరి పంట



కొత్తపల్లి తండా శివారులో..

మహాసభల వాల్‌పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న భవన నిర్మాణ సంఘం నాయకులు

అమరచింత: భవన, ఇతర నిర్మాణ రంగం కార్మిక సంఘం (టీయూసీఐ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించే రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు పట్టణంలోని మార్క్స్ భవనంలో బుధవారం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు వెంటనే పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుని నేటికి మూడేళ్లు అవుతున్నా ఇంత వరకు డబ్బులు మంజూరు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.5 వేల వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిలాని, రాజన్న, సామేలు, కురుమన్న, మస్లమని, సత్యనారాయణ, ప్రేమరత్నం, పాషా తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పాన్‌గల్: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. పరీక్షలకు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 140 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులు కలిపి మొత్తం 350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా విజయలక్ష్మి, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా మంజుల, బాలుర ఉన్నత పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆజీంపాష, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రాజవర్ధన్‌రెడ్డి వ్యవహరిస్తారన్నారు. 10 ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా విద్యాలయం విద్యార్థులు ఈ పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారని, రేమద్దుల ఉన్నత పాఠశాల విద్యార్థులు మాత్రం గోపాల్‌పేట మండలంలోని పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కొనసాగుతాయన్నారు.

ఇసుక తయారీ పరికరాలు సీజ్

- చెన్నూరు వాగులో జోరుగా ఫిల్టర్ ఇసుక దందా



ఫిల్టర్ ఇసుక తయారీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తిలకకుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేష్

గోపాల్‌పేట: ఇటీవల చెన్నూరు వాగులో ఫిల్టర్ ఇసుక తయారు చేసి తరలిస్తుండగా సీసీఎస్ పోలీసులు మూడు ఇసుక ట్రాక్టర్లు, ఒక జేసీబీ పట్టుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేష్ కుమార్, ఆర్‌ఐ యాదయ్య చెన్నూరు వాగును పరిశీలించారు. అక్కడ ఫిల్టర్ ఇసుక తయారీ కోసం ఉంచిన మూడు మోటార్లు, స్ప్రింక్లర్ పైపులు, స్టాటర్, వైరు, ఇసుక లోడ్ చేసే బకెట్‌ను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఫిల్టర్ చేసి ఉంచిన సుమారు డెబ్బై ట్రిప్పుల ఇసుకను గుర్తించారు. మైనింగ్ అధికారులకు రిపోర్ట్ చేశామని, గురువారం వారు వాగును పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఇకపై ఫిల్టర్ ఇసుక తయారు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

‘ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి’

వనపర్తి: జిల్లాలో ఎంపిక చేయబడిన 15 గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి పథకానికి ఎంపికైన లబ్ధిదారులందరూ ఈ నెలాఖరు లోపు ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించే విధంగా ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. ఇంకా ఇంటి నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులందరికీ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు సంయుక్తంగా చొరవ తీసుకొని దగ్గర్లో ఉన్న రీచ్ నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. ఇంటి నిర్మాణాన్ని బట్టి విడతల వారీగా నగదు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వస్తుందని వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ అధికారులు విఠోబా, పర్వతాలు, వెబెక్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



కొత్తకోట రూరల్: రోజురోజుకూ ఎండల తీవ్రత ఎక్కువవుతున్న నేపథ్యంలో కొత్తకోట చౌరస్తాలోని చెప్పులు కుట్టే వారికి, చిరు వ్యాపారులకు జేఎస్ రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ, అభయ ఫౌండేషన్, హైదరాబాద్ వారి సహకారంతో బుధవారం గొడుగులు అందజేసినట్లు నిర్వాహకులు సతీష్‌రాజ్ తెలిపారు. ఎండాకాలంలో జీవనోపాధి నిమిత్తం రోడ్ల పక్కన చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించే వారికి ఎండ వేడి నుంచి కాపాడుకునేందుకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కర్ణ కుమార్, జేవీ సతీష్, ఇజ్రాయిల్, కళ్యాణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

‘కవిత్వంలో రైతు కష్టం ప్రతిధ్వనించాలి’



వీరనాగు శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: గ్రామీణ ప్రజలు, రైతుల కష్టాలను గౌరవించే విధంగా కవిత్వం ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బుద్దారం ప్రాథమికోన్నత పాఠశాలలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిక్కొండ్ర రవి రచించిన ‘వీరనాగు శతకం’ అనే పుస్తకాన్ని మారం మల్లమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ చిక్కొండ్ర రవి చిన్న వయసులోనే పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వర్షంపై ఆధారపడే వ్యవసాయాన్ని చూసి చలించిపోయిన తాను భగీరథ ప్రయత్నంతో కృష్ణజలాలు తీసుకొచ్చి వనపర్తిని సస్యశ్యామలం చేసిన వైనాన్ని రవి పుస్తకంలో వివరించారని కొనియాడారు. వీరనాగు శతకం చరిత్రలో సామాజిక శతకంగా నిలిచిపోతుందని కొనియాడారు. కార్యక్రమంలో శిఖామణి, రచయిత సంధ్య, సిటీ కళాశాల తెలుగు శాఖ సంచాలకులు కోయి కోటేశ్వర్‌రావు, తెలంగాణ వికాసం సమితి అధ్యక్షుడు వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించని ఇళ్ల విద్యుత్ కనెక్షన్ కట్



అప్పారెడ్డిపల్లిలో ఇంటి విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తూ ఫొటో తీసుకుంటున్న విద్యుత్ అధికారులు

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం మంజూరు కానీ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ బుధవారం విద్యుత్ అధికారులు కట్ చేశారు. నెలకు 200 యూనిట్ల విద్యుత్ వాడే ప్రతి ఒక్కరికీ గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ప్రభుత్వం చెప్పడంతో నాటి నుంచి 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే వినియోగదారులు బిల్లులు చెల్లించడం మానేశారు. కానీ బుధవారం విద్యుత్ శాఖ అధికారులు జీరో బిల్లులో పేర్లు లేవనే కారణంగా అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ కనెక్షన్లు కట్ చేయడంతో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే వాళ్లు బిల్లులు కట్టొద్దని చెప్పి, ఇప్పుడు ఇలా కనెక్షన్లు కట్ చేయడం ఏమిటని ప్రజలు విద్యుత్ అధికారులను నిలదీస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ కొండయ్యను వివరణ కోరగా.. గృహజ్యోతి పథకంలో పేరు రాని వారందరూ బిల్లులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి చెక్ చేసుకోవాలని సూచించారు. బిల్లులు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో పాటుగా కట్ చేసినట్లు ఫొటో కూడ తీయమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన చేస్తున్న మాజీ సర్పంచులు

ఖిల్లాఘనపురం: మండలంలోని మాజీ సర్పంచులను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సర్పంచులు తమ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో ప్రభుత్వ ఆదేశం మేరకు వారిని ముందస్తుగా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ తాము అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి 15 నెలలు కావస్తున్నా నేటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వమంటే ఇలా ముందస్తు అరెస్టులు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కళ్లు తెరిచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మొత్తం వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దేవేందర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మండలంలోని పెద్దగూడెం, రాజపేట, అచ్యుతాపురం, కడుకుంట్ల సర్పంచ్‌లను వనపర్తి రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పెద్దగూడెం సర్పంచ్ కొండన్న మాట్లాడుతూ మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లను మాత్రమే అరెస్టు చేసి మా గొంతులు నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విధంగా అరెస్టులు చేయించడం సరైన నిర్ణయం కాదని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం



జిల్లాకేంద్రంలో ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొత్తకోట చౌరస్తాలో..

సాక్షి, నెట్‌వర్క్: బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం హర్షణీయమని కాంగ్రెస్, బీసీ సంఘాలు, దళిత నాయకులు కొనియాడారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లకు పెంచుతూ అసెంబ్లీలో బీసీ, ఎస్సీ బిల్లు పెట్టిన సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని ఆనందం వ్యక్తం చేశారు.

- జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ఎమ్మెల్యే మేఘారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.
- కాంగ్రెస్ కొత్తకోట మండల అధ్యక్షులు నాగారపు బీచుపల్లియాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్థానిక చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, డాక్టర్ పీజే బాబు, పట్టణ అధ్యక్షుడు పోతులపల్లి శ్రీనివాసులు, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, పాపయ్యగారి కృష్ణారెడ్డి, నరేందర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గంజాయి రమేష్, ఆగారం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్ పట్టణంలోని గాంధీచౌక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, గంగాధర్‌గౌడ్, పరమేష్, తులసీరాజ్, సుదర్శన్‌శెట్టి, శ్రీను, సాయిరాఘవ, యాదగిరిశెట్టి, రామలక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

- నిరుపయోగంగా వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు
- ప్రారంభానికి నోచుకోని వైనం
- నివాసగృహాల మధ్య శ్మశానవాటికలతో ఇబ్బందులు



చెన్నిపాడులో నివాసగృహాల మధ్యన ఉన్న శ్మశానవాటిక

మానవపాడు: గత ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ప్రజలకు ఇబ్బందుతు తలెత్తకుండా వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్ల ఏర్పాటుకు పూనుకుంది. అలంపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 124 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు నిర్మించగా పూర్తి స్థాయిలో నిరుపయోగంగా మారాయి. సెగ్రిగేషన్ షెడ్లది సైతం ఇదే పరిస్థితి ఏర్పడింది. చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదని విమర్శిస్తున్నారు.



అమరవాయిలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

నియోజకవర్గ వ్యాప్తంగా..

అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు, అలంపూర్, ఎర్రవల్లి, ఇటిక్యాల, అయిజ, రాజోళి, వడ్డెపల్లి, ఉండవెల్లి గ్రామాల్లో మొత్తం 124 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతి గ్రామ పంచాయతీలో వైకుంఠధామాల నిర్మాణాలకు 2019లో గత తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్కో వైకుంఠదామానికి పీఆర్‌శాఖ నుంచి రూ. 12.60 లక్షలు, సెగ్రిగేషన్ షెడ్లకు ఈజీఎస్ ద్వారా నిర్మించిన వాటికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లోని వైకుంఠదామాలు నిర్మించి నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో నాసిరకంతో నిర్మించడంతో గోడలకు బీటలు వారుతున్నాయి. చుట్టూ చెట్లు పెరిగి కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైకుంఠదామాలు, సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాడుకలోకి తీసుకురావాలి..



ప్రభుత్వం వైకుంఠదామాలను వాడుకలోకి తీసుకురావాలి. చాలా గ్రామాల్లో నివాసగృహాల మధ్య శ్మశాన వాటిక వలన ఇబ్బందులు పడుతు న్నాం. సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

-బజారన్న, మానవపాడు

సౌకర్యాలు కల్పించాలి..



వైకుంఠదామాల్లో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలి. వైకుంఠదామాలు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్వహణ లేక వదిలేశారు. ప్రభుత్వం చొరవ చూపి వినియోగంలోకి తేవాలి.

- యుగంధర్, చెన్నిపాడు

సమస్యలు పరిష్కరిస్తాం..

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైకుంఠదామాలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, తదితర సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిరుపయోగంగా ఉన్న వాటిని పరిశీలించి మరమ్మతులు చేపడుతాం. సెగ్రిగేషన్ షెడ్లు వాడుకలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

-నాగేంద్రం జిల్లా పంచాయతీ అధికారి

‘పది’ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



శాగాపూర్‌తండాలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌తండాలో బుధవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పాఠశాల సహవిద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. వార్షిక పరీక్షల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల జీహెచ్‌ఎం నర్సింహ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ శ్యామలమ్మ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కురుమయ్య, రాములు, రజిత, అంబిక, కురుమూర్తి, సంతోష్, రోహిణి, ఆర్పీ రాములు, విద్యార్థులు వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

చిన్నంబావి: మండలంలోని అయ్యవారిపల్లి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు పరశురాంయాదవ్ ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, జగదీష్, బొల్లు శ్రీనివాసులు యాదవ్, శంకర్‌యాదవ్, శ్రీకాంత్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.